

# సాధనవల్లన

మా ఇల్లు చాలా విశాలమయినదే. దొడ్డి కూడా కావలసినంత ఉంది. కాని మొక్కలు పెంచటంలేదు బద్ధకం చేత. ఆపని అంటూ ప్రారంభిస్తే చచ్చేచాకిరి చెయ్యాలని భయం. రోజూ కలుపుతీయటం, నీళ్లు పోయటం మొదలైనవన్నీ చెయ్యాలంటే చిరాకు.

దొడ్లో మొలకలైతే లేవలేదుగానీ నా మనస్సులో ఈ మధ్యనే కొన్ని ఆశలు చిగురించాయి. ఏమంటే సంగీతానికి మొక్కలు బాగా పెరుగుతాయట. ఎలాగో రోజూ సంగీత సాధనచేస్తూ ఉంటాను కదా. కొన్ని మొక్కలు పెట్టి వాటిమధ్య కూర్చునే సాధన సాగిస్తే — ఒకే దెబ్బకి రెండు పిట్టలు అటు మొక్కలు ఇటు సంగీతం కదా అని.

ఓ సెలవురోజు అనుకున్నట్టుగానే కొన్ని విత్తనాలు తెచ్చాను. ఇంటింటికీ తిరిగి రక రకాల మొక్కలు పట్టుకు వచ్చాను. పేలంతా పదునుచేసి మొక్కలు విత్తనాలను నాటేసరికి తల ప్రాణం తోకకు వచ్చింది. ఆ రోజుకుమాత్రం నీళ్లవరకే పోశాను. సంగీతం వినిపించలేదు— ఓపికలేదు. ఎలాగూ వేళ్ళు నాటుకోలేదుగదా సంగీత మాధుర్యాన్ని ఏం ఆస్వాదిస్తాయిలే అని.

మర్నాటినుంచి కార్యక్రమం ఏర్పరుచుకొన్నాను. నీళ్ళు ఇంట్లో వాళ్లెవరో ఒకరు పోసేట్టు, నేను సంగీత సాధన సాయంత్రం వో గంటపాటు చేసేట్టు. ఎంతైనా నీళ్ళు పోస్తూ పని చేస్తూ పాడితే పాట శృతిలో రాకపోవచ్చు— మొక్కలూ పెరక్కపోవచ్చు.

నాకు గులాబీ పూలంటే చాలా ఇష్టం. అందు కని గులాబీ మొక్కల దగ్గిరే ఎక్కువసేపు సాధన చేయాలని, వాటికి మరీ దగ్గరగా కూర్చుని, వాటికి సంగీతం వీలైనంత పెద్దగా వినపడేలా చేయాలని నిర్ణయించుకున్నాను.

సంగీతం పాడటం ప్రారంభించాను.

మా ఇంటిచుట్టూరా నాల్గయిదు మేడ లున్నాయి. నా గాన మాధుర్యాన్ని విని కాబోలు— వేళకానివేళ ఇదేమిటి బాబూ అనుకుంటూ బయ టకు వచ్చారు. నేనైతే చూసీ చూడనట్టు వూరుకున్నాను. ఇటువంటి చిన్న అభ్యంతరాలన్నీ పెట్టుకుంటే ఇంక మొక్క చిగర్చాల్సిందే!

నీళ్ళు, సంగీతాల కొదవలేకుండా ఒక వారం రోజులు గడిచాయి. వారంరోజులైతే ఒక వాక్యంలో గడిచి పోయాయి కానీ ఎన్నెన్ని విశేషాలు జరిగాయో చెప్పటానికి వారాతలు చాలవు.

చుట్టు పక్కల వాళ్ళు మొదట రెండురోజులు సహించారుకానీ, ఆ తరువాత ఇక నా సంగీతాలన్నీ భరించలేమన్నారు. మొక్కలకి నసాళానికి అంటాలనే ఉద్దేశంతో గట్టిగా పాడుతూంటం వల వాళ్లకి రేడియో వినిపించడం లేదట. ఇంకా కొంత మంది న్యూసెన్సు కేసుపెడ్తామని బెదిరించేదాకా వచ్చారు.

ఇంట్లో మా వాళ్ళు కూడా నాల్గు రోజులు నీళ్ళు పోసిన తరువాత మావన్నన్నీ పాడవుతున్నాయి. నువ్వే నీళ్ళ పోసుకో, సంగీతం ఆ తర్వాత పాడుకో వచ్చులే అన్నారు. నాకైతే బలేమండింది. మళ్లా పూలు విరగబూస్తే పెట్టుకునేది వాళ్లే! వింతగా తోచి ఆకతాయిలు పిల్లలంతా వస్తున్నారు. ఆపలేక చస్తున్నాం, నీ సంగీతం ఆపు అనేవారు కూడా.

నాటిన రోజునుంచీ చూస్తూనే ఉన్నాను. మొక్కల్లో కాని విత్తనాల్లో కానీ ఏదైనా ఎదుగు బొదుగు ఉంటుందేమోనని. వారం తిరిగాక కూడా ఏమీ మార్పు కనిపించలేదు. గడ్డి మాత్రం దట్టంగా పెరిగింది. నా సంగీతానికి అది పెరిగినా చాలని సంతోషించాను.

ఐతే కొన్ని విత్తనాలు అప్పుడే విచ్చుకుని మొలకలు పైకి రావటం లీలగా కనిపించింది. గులాబి ఆకులన్నీ రాలిపోతే బాధ పడ్డాను కానీ, ఆ రాలిపోవటం కొత్త చిగుళ్ళకి నాంది అని వారం రోజులగ్గానీ తెలీలేదు. ఈ చిన్న మార్పులన్నీ చూసి— నా ఉత్సాహం ఇనుమడించిందే కాని— చుట్టూ గల పోరు వలన ఏ మాత్రం తగ్గలేదు.

తిట్టుకుంటూనే అయినా నీళ్ళ పోస్తూనే ఉన్నారు. నేను సంగీతం మరింతసేపు వినిపించటం మొదలు పెట్టాను. ఆఖరికి ఒక రాత్రి కల కూడా కన్నాను మా దొడ్డి నందనవనంలాగా తయారయి నట్టు.

ఇంకో పది రోజులు గడిచాయి— నీళ్లే ఎక్కువయ్యాయో, సంగీతమే ఎక్కువయిందో— పుట్టిన చిగుళ్ళు రంగు మారటం మొదలు పెట్టింది— అంటే నల్లగా మాడిపోవటం మొదలు పెట్టా యన్నమాట. మొలకెత్తిన విత్తనాలు పది రోజులైనా కూడా భూమికి జానెడుకంటే లేవలేదు. ఎక్కడి ఆకులు అక్కడ చుట్ట చుట్టుకోవటం మొదలు పెట్టాయి. నా ఉత్సాహానికి, సాధనకి తగ్గ జవాబు లేకపోయేసరికి నేను చాలా నొచ్చుకున్నాను. దాంతోపాటే తోటపట్ల నా శ్రద్ధా తగ్గిపోయింది.

పోతే గులాబీ చెట్టుకి అతిశ్రద్ధగా బిగ్గరగా వినిపించిన సంగీతం మాత్రం వృధా కాలేదు. అది బాగా చిగిర్చి మొగ్గ కూడా తొడిగింది. దానికి మాత్రం నేనే శ్రద్ధగా నీళ్ళ పోస్తూ రోజూ దాని దగ్గర కూర్చుని సన్నగా రాగాలు తీసేవాణ్ని. ఎందుకైనా మంచిదని హిందూస్థానీ శాస్త్రీయ సంగీతాలూ అప్పుడప్పుడు వాద్య సంగీతం కూడా వినిపించాను.

ఒక శుభ ముహూర్తాన గులాబీ ఒక గడ్డి పువ్వు పూసింది.

—ఆర్. వి. శాస్త్రి